డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



జీఎంకు సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి సూచించారు. ఈ మేరకు ఆమె గురువారం కంచన్‌బాగ్‌లోని జలమండలి కార్యాలయంలో జలమండలి జీఎం సుబ్బారాయుడును కలిసి సమస్యలను వివరించారు. ఆమె మాట్లాడుతూ.. మేకలమండి, సర్దార్ పటేల్‌నగర్, అంబికానగర్, హరిజన బస్తీ, గౌలిపురా నుంచి ఛత్రినాక మెయిన్ రోడ్డు, హనుమాన్‌నగర్ బస్తీల్లో డ్రైనేజీలు పొంగిపొర్లుతుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా మాజీ అధ్యక్షుడు ఆలె భాస్కర్ రాజ్, కొడి సురేందర్, ఇ.సుమన్‌కుమార్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు జి.రఘుకాంత్, ఎ.మహేందర్ గిరి, మల్లేష్, ఎ.శ్రీనివాస్, రవి, సత్తప్ప, సంగ్రామ్, వికాస్, సాకేత్, డి.రాజు, కె.వెంకటేశ్ పాల్గొన్నారు.

ఆటాడుకుందాం రండి!

వేసవి శిక్షణ కేంద్రాల్లో విద్యార్థుల సందడి

స్పోర్ట్స్ అథారిటీ సమ్మర్ క్యాంప్‌లకు అనూహ్య స్పందన





వేసవి శిక్షణా శిబిరాలలో విద్యార్థులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర క్రీడాశాఖ ఆధ్వర్యంలో క్రీడా ప్రాధికార సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లా కేంద్రాల్లో విజయవంతంగా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరాలకు విద్యార్థులకు, హౌత్సాహిక క్రీడాకారుల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తుంది. ఈ వేసవి శిక్షణా శిబిరాల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా శాట్స్ ఆధ్వర్యంలో తగు చర్యలు తీసుకున్నారు. ఏడాదిపాటు అనునిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని కలుగజేస్తున్నాయి. స్పోర్ట్స్ అథారిటీ ఎండీ డాక్టర్ కె.లక్ష్మీ సూచనలతో గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లోని స్టేడియాల్లో ఈ వేసవి శిక్షణా శిబిరాలు కొనసాగుతున్నాయి.

గ్రేటర్ హైదరాబాద్ స్పోర్ట్స్ స్టేడియాలు..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు స్టేడియాల్లో వేసవి శిక్షణ కేంద్రాలు సందడిగా మారాయి. ఎల్బీస్టేడియం, జీఎంసీ బాలయోగి స్టేడియం, గచ్చిబౌలి, షూటింగ్ రేంజ్, జింకానా గ్రౌండ్స్ (సికింద్రాబాద్), సైక్లిన్ వే (ఓయూ), సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్ (హుస్సేన్ సాగర్) స్టేడియాలలో జరుగుతున్న శిక్షణ శిబిరాలలో క్రీడాకారులు సందడి చేస్తున్నారు. అనుభవం కలిగిన క్రీడా శిక్షకులతో అందరికీ అందుబాటులో ఉండే విధంగా నిర్ణయించిన ఫీజుల, అధికారుల సమన్వయంతో ఈ సంవత్సరం శిక్షణా శిబిరాలు కొనసాగుతున్నాయి.

శిబిరాలకు ప్రత్యేక నిధులు..

ఈ సంవత్సరం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఘనంగా నిర్వహించాలనే సంకల్పంతో క్రీడా ప్రాధికార సంస్థ తగు ఏర్పాట్లను చేసింది. వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు ప్రతి జిల్లాకు స్పోర్ట్స్ అథారిటీ తరఫున నిధులు మంజూరు చేశారు. క్రీడా సాంస్కృతిక ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్య, శాట్స్ ఎండీ కె.లక్ష్మీ క్రీడా అధికారులతో కోచ్‌లతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ శిక్షణ శిబిరాల విజయవంతానికి తగు సూచనలు చేస్తున్నారు.

వేసవి శిబిరాల్లో ఆణిముత్యాలు..

దాదాపు 3 దశాబ్దాల నుంచి స్పోర్ట్స్ అథారిటీ ఈ వేసవి శిబిరాలను నిర్వహిస్తుంది. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిన ఎందరో ఆణిముత్యాలు క్షేత్ర స్థాయిలో కష్టపడ్డవాళ్లే. పద్మశ్రీ పుల్లెల గోపీచంద్, గుత్తా జ్వాలా, సైనా నెహ్వాల్, పీవీ. సింధు (బ్యాడ్మింటన్), అరుణారెడ్డి, (జిమ్నాస్టిక్స్), రవికాంత్ రెడ్డి, వెంకట్‌నారాయణ (వాలీబాల్) లాంటి ఎందరో క్రీడాకారులు స్పోర్ట్స్ అథారిటీ శిక్షణా కేంద్రాల్లో ఓనామాలు దిద్దినవారు కావడం విశేషం.

అద్భుతమైన స్పందన..

స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలకు విద్యార్థుల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తుంది. ప్రతి స్టేడియంలో నిర్వహిస్తున్న ఆయా క్రీడలకు స్పందించి క్రీడారంగ నిష్ణాతులచే మోటివేషనల్ క్లాసెస్ నిర్వహించడం ఈ సారి ప్రత్యేకత. సమాజంలో క్రీడలకు ఉన్న ప్రాధాన్యత, ఆ క్రీడకు సంబంధించిన విశేషాలను వివరిస్తూ క్రీడాకారులతో పాటు వారి తల్లిదండ్రులను ఒకేచోట కలిపి మోటివేషనల్ క్లాసెస్ నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

సామాన్యులకు అందుబాటులో..

సామాన్య, మధ్యతరగతికి చెందిన విద్యార్థులకు క్రీడా సౌకర్యాలను అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ఈ శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశాం. తక్కువ ఫీజుతో మెరుగైన శిక్షణను విద్యార్థులకు అందించాం. శిక్షణా శిబిరంలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి కోచింగ్ సర్టిఫికెట్లను అందజేయడంతో పాటు వారు రెగ్యులర్‌గా కోచింగ్‌లో పాల్గొనే విధంగా ప్రయత్నాలు చేస్తున్నాం. – లక్ష్మీ, శాట్స్ ఎండీ

మీరాలంమండిలో ప్రత్యేక పూజలు



హోమం చేస్తున్న అనంతోజ్ హంసరాజ్ దంపతులు

చార్మినార్: పౌర్ణమి సందర్భంగా మీరాలంమండి మహంకాళి ఆలయంలో గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో చండీహోమం, సత్యనారాయణ స్వామి వ్రత పూజలు జరిగాయి. స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులే కాకుండా నగరంలోని ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు అత్యధిక సంఖ్యలో ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన చండీహోమంలో హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు అనంతోజ్ హన్స్‌రాజ్ దంపతులు పాల్గొన్నారు. వారిని వేద పండితులు ఆలయ మర్యాదలతో సత్కరించారు.

మీర్ ఆషమ్‌అలీ, మీర్ అలీ అబ్బాస్‌లకు సిల్వర్ మెడల్స్



అబిడ్స్: 7వ చాంపియన్‌షిప్ జాతీయ బాక్సింగ్ పోటీల్లో నాంపల్లి నియోజకవర్గానికి చెందిన మీర్ ఆషమ్‌అలీ, మీర్ అలీ అబ్బాస్‌లకు సిల్వర్ మెడల్స్ లభించాయి. ఛత్తీస్‌గఢ్ రాయపూర్‌లో జరిగిన 7వ జాతీయ చాంపియషిప్ బాక్సింగ్ పోటీల్లో మీర్ ఆషమ్‌అలీ 25 కిలో విభాగంలో వెండి పతకం, మీర్ అలీ అబ్బాస్ 57 కిలోల విభాగంలో వెండి పతకం సాధించారు. షేక్ ఖలీద్ టీమ్ ఇండియా కోచ్ సహకారంతో ఈ ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారని మజ్లిస్ పార్టీ నాయకుడు మీర్ జావేద్ అలీ పేర్కొన్నారు.

అందుబాటులోకి మహాదేవ్ లైటింగ్ స్టూడియో



లక్డీకాపూల్: జాంబాగ్‌లో మహాదేవ్ లైటింగ్ స్టూడియో ప్రారంభమైంది. గురువారం ఏర్పాటు చేసిన ఈ ప్రీమియర్ షోరూమ్‌లో వినూత్న లైటింగ్ టెక్నాలజీతో కళాత్మక హస్తకళను మిళితం చేసే అద్భుతమైన కలెక్షన్స్ అందుబాటులో తీసుకువచ్చామని నిర్వాహకులు శ్యామ్ కర్నానీ, అభిషేక్ బజాజ్, అనికైత్ జహవర్, శుభమ్ మహేశ్వరి, హర్ష్ కర్నానీ తెలిపారు.

నర్సింగ్‌రావుకు నివాళి



జియాగూడ: కార్వాన్ విద్యుత్ లైన్‌మెన్ నర్సింగ్‌రావు గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.మీనా, ఎం.శ్రవణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పి.నాగేశ్వర్, కార్వాన్ సెక్షన్ ఏఈ రియాజ్ అన్నారు. గురువారం జియాగూడలోని దుర్గానగర్‌లో ఉంటున్న వి.నర్సింగ్‌రావు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నర్సింగ్‌రావ్‌కు భార్య లత, కుమారుడు విజయ్‌రాజ్, కూతురు ఆరాధ్య ఉన్నారని, వీరిని ప్రభుత్వం, విద్యుత్‌శాఖ అధికారులు ఆదుకోవాలని వారు కోరారు.

బాలుడి అదృశ్యం



పర్వేష్

అబిడ్స్: మంగళ్‌హాట్‌లో 13 ఏళ్ల బాలుడు అదృశ్యమయ్యాడు. అల్లాబండ ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న పర్వేష్ మంగళ్‌హాట్ ప్రాంతంలో నివసిస్తాడు. బుధవారం ఇంటి నుంచి వెళ్లిన పర్వేష్ తిరిగి రాలేదు. పర్వేష్ ఆచూకీ దొరకపోవడంతో కుటుంబసభ్యులు మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్రౌన్ కలర్ టీషర్ట్, బ్రౌన్ కలర్ ప్యాంట్ ధరించిన పర్వేష్ ఆచూకీ లభిస్తే మంగళ్‌హాట్ పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ అస్లాం విజ్ఞప్తి చేశారు.

నెలలు నిండని శిశువుకు ప్రాణం పోశారు!



తల్లిబిడ్డను అభినందిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి

నాంపల్లి: నెలలు నిండని శిశువుకు నిలోఫర్ వైద్యులు ప్రాణం పోశారు. 560 గ్రాముల బరువుతో పుట్టిన శిశువుకు రెండు నెలలు పాటు చికిత్స అందజేసి గురువారం డిశ్చార్జి చేసి తల్లిబిడ్డను సురక్షితంగా ఇంటికి పంపించారు. వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ముస్తాక్, రిజ్వాన్ దంపతులకు రెండు నెలల క్రితం ఆడ శిశువు జన్మించింది. ఏడు నెలలకే ప్రసవించడంతో శిశువు ఆరోగ్యం క్షీణించింది. స్థానిక వైద్యులు సలహాతో చికిత్స నిమిత్తం హైదరాబాదులోని నిలోఫర్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వెంటనే నిలోఫర్ వైద్యాధికారులు ఆసుపత్రిలోని నియోనటాల్ యూనిట్‌లో చేర్చుకుని చికిత్సలు అందించారు. వైద్యులు స్వప్న, అలివేలు, సురేష్ నెలలు తక్కువ, బరువు తక్కువ పుట్టిన శిశువుకు రెండు నెలల పాటు వైద్య సేవలందించారు. 560 గ్రాముల బరువుతో పుట్టిన శిశువు బరువును 1465 గ్రాములకు పెంచారు. తల్లిబిడ్డలకు మెరుగైన చికిత్స అందించిన వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి ప్రశంసించారు.

ఇరాన్ అధ్యక్షుడి మృతిపై కిషన్‌రెడ్డి సంతాపం



సంతాప పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తదితరులు

చార్మినార్: ఇరాన్ అధ్యక్షుడు అయాతుల్లా సయ్యద్ ఇబ్రాహీం రైసీ మృతిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు పంపించిన సంతాప పత్రాన్ని బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ హైదరాబాద్ నగరంలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ మెహదీ షహరోఖీకి అందజేశారు. తెలంగాణ బీజేపీ తరఫున తమ ప్రగాఢ సానుభూతి తెలియజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరాజ్ ఉస్సీసా, నవాబ్ సహ్‌ఫత్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇరాన్ అధ్యక్షుడి మృతి విచారకం



విజిట్ బుక్‌లో సంతకం చేస్తున్న మతీన్ ఆలీషా

గోల్కొండ: ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ హెలికాప్టర్ దుర్ఘటనలో మృతి చెందడం విచారకరమని ఇండో ఇరాన్ ఫ్రెండ్‌షిప్ లీగ్ కన్వీనర్, ఆల్ ఇండియా కీరత్ కమిటీ అధ్యక్షుడు ఖారీ మౌలానా సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీ అన్నారు. గురువారం ఆయన హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సులేట్ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడి విజిట్ బుక్‌లో ఇరాన్ అధ్యక్షుడి మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ సంతాప వాఖ్యాలు రాశారు. ఆయన మాట్లాడుతూ.. దివంగత అధ్యక్షుడి కాలంలో ఇండో ఇరాన్ సంబంధాలలో మంచి పురోగతి వచ్చిందన్నారు. అనంతరం ఆయన హైదరాబాద్‌లో ఇరాన్ కన్సూలెట్ షారుఖీని కలిశారు.

లక్ష్మీనగర్ చౌరస్తాలో త్వరలో ఇందిరమ్మ విగ్రహం ఏర్పాటు

గోల్కొండ: లక్ష్మీనగర్ చౌరస్తాతో త్వరలోనే ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కార్వాన్ నియోజకవర్గం ఏ-బ్లాక్ అధ్యక్షుడు కురాకుల కృష్ణ అన్నారు. గురువారం కార్వాన్ బాంజవాడిలో కార్వాన్ కాంగ్రెస్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ విషయంపై హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విగ్రహం ఏర్పాటుపై ఆయన అభిప్రాయం తీసుకుంటామన్నారు.

25న జీఎన్ఐటీఎస్ గ్రాడ్యుయేషన్ డే

గోల్కొండ: ఈనెల 25న తమ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్నామని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్ పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి అన్నారు. 2020–2024 బ్యాచ్‌కు చెందిన బీటెక్, ఎంటెక్ అభ్యర్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్నామని ఆమె తెలిపారు. కళాశాల ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో 25వ తేదీన 5.30 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్ ప్రొఫెసర్ సునైనాసింగ్ ముఖ్యఅతిథిగా, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్నారని ఆమె పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి



కమిషనర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

సుల్తాన్‌బజార్: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) టీమ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం కోఠిలోని కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కర్ణన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు కవ్వం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..3 నెలలుగా కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు రావడం లేదని, అలాగే 7 నెలల పీఆర్‌సీ ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కమిషనరేట్‌ను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్లు తిరుమలరెడ్డి, సమీ, ఆనంద్, పండరి, రాజశేఖర్, రాణి, నరసింహ, ఏఎన్ఎంలు, అనురాధ, ధనలక్ష్మి, అన్ని కేడర్ల వాళ్లు దాదాపుగా 200 మందికి పైగా పాల్గొన్నారు.

‘ఏపీలో పనిచేసే ఉద్యోగులను స్వరాష్ట్రానికి తీసుకొస్తాం’



టీఎన్జీఓ నేతలను సత్కరిస్తున్న జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్

నాంపల్లి: ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగులందరినీ త్వరలోనే స్వరాష్ట్రానికి తీసుకొస్తామని తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఏపీకి వెళ్లిన తెలంగాణ ఉద్యోగులను తీసుకురావడంలో విఫలమైందని ఆరోపించారు. కేంద్ర సంఘం కార్యాలయాన్ని సందర్శించిన ఆదిలాబాద్ జిల్లా టీఎన్జీఓ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అశోక్, ఎ.నవీన్, నిర్మల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వి.ప్రభాకర్, ఎన్.రవికుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొండూరు గంగాధర్ మాట్లాడుతూ.. త్వరలోనే ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం గౌరవాధ్యక్షుడు ఖాదర్ బిన్ హసన్, నగర శాఖ కార్యదర్శి జి.శ్రీనివాస్, సయ్యద్ ఖలీల్, పి.సుధాకర్ పాల్గొన్నారు.

రైల్వే ఈ-టికెట్లను విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

నాంపల్లి: రైల్వే ఈ–టికెట్లను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కల్పన తెలిపిన వివరాల ప్రకారం..యూసుఫ్‌గూడ వెంకటగిరి ప్రాంతంలోని ఓ ఇంటిలో ముదావత్ శ్రీను అక్రమంగా రైల్వే ఈ–టికెట్లను విక్రయిస్తున్నాడు. ల్యాప్‌టాప్ సహాయంతో ఆన్‌లైన్‌లో టికెట్లను కొనుగోలు చేస్తూ ప్రయాణికులకు విక్రయిస్తున్నారు. ఐఆర్‌సీటీసీ ఆదేశాల మేరకు వచ్చిన సమాచారంతో డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ దేవస్మిత సి.బెనర్జీ పర్యవేక్షణలో హైదరాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులు దాడి చేశారు. అక్రమంగా టికెట్లను విక్రయిస్తున్న ముదావత్ శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి ఒక సెల్‌ఫోన్, 12 రైల్వే ఈ–టికెట్లు, రూ.44391 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని గురువారం తెలంగాణ ఉద్యమకారుడు రాజ్‌మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ కార్పొరేటర్ శంకర్ సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న ఎర్మనీ కైలాష్ గంగపుత్ర

గౌలిపురా: గౌలిపురా మాజీ కార్పొరేటర్, దివంగత శంకర్ చేసిన సేవలు మరువలేనివని శ్రీ మహంకాళి మాతేశ్వరి భారతమాత, శ్రీ కోట మైసమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర అన్నారు. గౌలిపురాలోని ఆరె కటిక సంఘంలో దివంగత నేత, మాజీ కార్పొరేటర్ కె.శంకర్ సంతాప సభను నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి శంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కైలాష్ మాట్లాడుతూ..శ్రీ మహంకాళి మాతేశ్వరి భారత మాత, శ్రీ కోట మైసమ్మ ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడిగా, వీఎస్‌టీ కంపెనీలో బీఎంఎస్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా, ఉమ్మడి దేవాలయాల కమిటీ మాజీ అధ్యక్షుడిగా, కార్పొరేటర్‌గా కె.శంకర్ ఎనలేని సేవలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలె భాస్కర్ రాజ్, గౌలిపురా కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్, ఆలే జితేంద్ర, చర్మాణి రూప్‌రాజ్, ఆలయ కమిటీ ముఖ్య సలహాదారులు ఎస్.మల్లేషం గౌడ్, కె.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కె.ఎస్.ఆనంద్ రావు, ఆదర్ల మహేశ్, ఉప్పుగూడ మహంకాళి ఆలయ కమిటీ అధ్యక్షులు మధుసూదన్ గౌడ్, మోకాళ్ల వెంకటేష్, శివరత్నం పాల్గొన్నారు.

ఉద్యోగుల అభ్యున్నతికి టీఎన్జీఓస్ కృషి



ముజీబ్ హుస్సేన్‌ను సత్కరిస్తున్న మహ్మద్ షరీఫుద్దీన్ తదితరులు

అబిడ్స్: ఉద్యోగుల అభ్యున్నతికి టీఎన్జీఓస్ యూనియన్ ప్రత్యేక కృషి చేస్తుందని హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు ఎస్ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం నాటి నుంచి హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ముజీబ్ హుస్సేన్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా గెలిపించాలని కోరుతూ పీవీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్సిటీ ఉద్యోగులు ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎం.ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..ఉద్యోగులకు 24 గంటల పాటు అండగా ఉండి విశేష సేవలందిస్తున్న తనను కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా గెలిపిస్తే రాష్ట్ర స్థాయిలో కూడా ఉద్యోగులకు అండగా ఉంటానన్నారు. తెలంగాణలో ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడమే తన ప్రధాన ఎజెండా అని ఆయన అన్నారు. పీవీ నర్సింహారావు వెటర్నరి యూనివర్సిటీ అధ్యక్షుడు మహ్మద్ షరీఫుద్దీన్ మాట్లాడుతూ..ఉద్యోగులందరూ ముజీబ్ హుస్సేన్‌ను కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జి.ఆంజనేయులు, టి.నర్సింహ, మధుసూదన్, టి.రాజ్‌కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కేంద్ర సంఘం నాయకులు మారం జగదీశ్వర్‌పై తమకు పూర్తి నమ్మకం ఉందని, ముజీబ్ హుస్సేని సేవలను గుర్తించి ప్రధాన కార్యదర్శిగా నియమించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

మైనర్‌ను పెళ్లి చేసుకున్న యువకుడి రిమాండ్

సుల్తాన్‌బజార్: బాలికకు మాయమాటు చెప్పి వివాహం చేసుకున్న యువకుడిపై సుల్తాన్‌బజార్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచార్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లాకు చెందిన హరికృష్ణ (30) ఈ నెల 11న సుల్తాన్‌బజార్ మెట్రోస్టేషన్ వద్ద నుంచి బాలికను మాయమాటలు చెప్పి విజయవాడకు తీసుకెళ్లి ఓ ఆలయంలో పెళ్లి చేసుని లాడ్జిలోకి తీసుకువెళ్లి లైంగిక దాడి చేశాడు. బాలిక అదృశ్యంపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆచూకీ కోసం గాలించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇద్దరిని గురువారం అదుపులోకి తీసుకున్నారు. అమ్మాయి మైనర్ కావడంతో హరికృష్ణపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనర్సింహస్వామి జయంత్యుత్సవాలు



నర్సింహస్వామి ఊరేగింపు




పూజల్లో లక్ష్మీనారాయణ సోనీ, విజయ సోనీ కుటుంబ సభ్యులు

దూద్‌బౌలి: లక్ష్మీనర్సింహస్వామి జయంత్యుత్సవాలు సిప్లిగంజ్‌లోని నర్సింగ్ బాన్ ఆలయంలో భక్తిశ్రద్ధలతో జరిగాయి. ప్రముఖ వ్యాపార వేత్త లక్ష్మీనారాయణ సోనీ, విజయ సోనీ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. పురానాపూల్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్, బీఆర్ఎస్ నాయకులు పెండ్యాల లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్ నియోజకవర్గంలో..

అబిడ్స్/సుల్తాన్‌బజార్: గోషామహల్ నియోజకవర్గంలోని బేగంబజార్ నర్సింహస్వామి ఆలయం, సుల్తాన్ బజార్ నర్సింహస్వామి ఆలయంలో జయంత్యుత్సవాలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ గోవింద్‌రాఠీ ఆధ్వర్యంలో స్వామివారి ఊరేగింపు చేపట్టారు. ఈ వేడుకల్లో ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్‌రాథోడ్, కార్పొరేటర్ లాల్‌సింగ్, ముఖేష్ సింగ్, సుమిత్‌రాఠి, అమిత్‌రాఠి, మేఘరాణి అగర్వాల్, రమేష్ జోషి పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న చంద్రకాంత్, అనంత్‌కృష్ణ

కార్వాన్‌లో..

జియాగూడ: కార్వాన్‌లోని ఏకశిల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జయంత్యుత్సవాలు గురువారం ముగిశాయి. ముఖ్యఅతిథులుగా గోల్కొండ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి గూడుమని చంద్రకాంత్, ఆలయ ప్రతినిధి పడాల అనంత్‌కృష్ణ, కార్వాన్ నియోజకవర్గం బీజేవైఎం కన్వీనర్ ప్రవంత్, జియాగూడ ఓబీసీ ప్రధాన కార్యదర్శి గుర్రం శివశంకర్, హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షం వస్తే వణుకే..

- ఎప్పుడు వర్షం వచ్చినా లోతట్టు ప్రాంతాల రోడ్లు జలమయం
- రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు



బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ రోడ్డులో నిలిచిపోయిన వరద నీరు

చార్మినార్: ఇటీవల దంచికొడుతున్న భారీ వర్షానికి పాతబస్తీలోని లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. వరద నీరు వెళ్లడానికి సరైన మార్గాలు అందుబాటులో లేకపోవడంతో రోడ్లపై ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. దీంతో అటు వైపు నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌లోని రంధ్రాలు మూసుకుపోవడంతో ఎప్పటికప్పుడు వరదనీరు వెళ్లడానికి వీలు పడడం లేదు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లు స్థానికులకు నరకయాతన కలిగిస్తున్నాయి. వాహనాలను వరదనీటిలో తీసుకెళితే ఇంజన్ పాడై వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయని.. వర్షాలను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలోని ఇంజనీరింగ్ విభాగం తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుండగా.. ఆ దిశలో పనులు జరగకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి.

బహదూర్‌పురాలో..

పాతబస్తీ నుంచి వెళ్లే బెంగళూర్ జాతీయ రహదారి రోడ్డులోని బహదూర్‌పురాలో ఎప్పుడు వర్షం కురిసినా.. వరద నీరు రోడ్డుపై నిలిచిపోతుండడంతో అటువైపు నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ ప్రధాన రోడ్డులో ముఖ్యంగా బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్‌తో పాటు బహదూర్‌పురా తహసీల్దార్ కార్యాలయాలు ఉండడంతో అధికారులు, సిబ్బందితో పాటు దరఖాస్తు దారులు, ఫిర్యాదుదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ఇక్కడి రోడ్డు పూర్తిగా వరద నీటితో మునిగిపోయింది. దీనికి తోడు అక్కడి డ్రైనేజీలు పొంగిపొర్లుతూ మురుగు నీరు ఈ వరద నీటితో కలిసి పోయింది. దుర్వాసనతో పాటు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఇక్కడ నుంచి జూ పార్కు వరకు కొత్తగా పై ఓవర్ బ్రిడ్జి నిర్మించడంతో బహదూర్‌పురా చౌరస్తా వైపు వెళ్లే ఈ రోడ్డును పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.